ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
విజయనగరం
జిల్లా వార్తలు
సోమవారం 30 జూన్ 2025



బుల్లితెరపై విజయనగరం వాసులు..

విజయనగరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): 'సింపురు జుట్టుదాన్ని.. సెవులెరుకన చుట్టదాన్ని.. చేతులగ్గి పెట్టిదాన్ని.. ఉంగరాల మెట్టదాన్ని.. నేనట్టాంటి ఇట్టాంటాడదాన్ని కాదు బావో..పల్సరు బైక్ మీద రారాబావ'.. అని పాడే ఈ పాటకు ప్రేరణ జిల్లాకు చెందిన ఇద్దరు రేలారే రేలా కళాకారులు. అందులో ఒకరు రమణ, మరొకరు జానకిరావు. వీరి గొంతును, ప్రతిభను సోషల్ మీడియానే ప్రపంచానికి చాటిచెప్పింది. వారిలో ఉన్న కళా నైపుణ్యాన్ని బయటకు తీసింది. సెలబ్రిటీల జాబితాలో చేర్చింది.

మంచికి వాడుకుందాం



- సోషల్ మీడియాతో ఉపయోగాలెన్నో
- సక్రమంగా వాడుకుంటే మేలు
- లేదంటే దుష్పరిణామాలు తప్పవు
- నేడు ప్రపంచ సోషల్‌మీడియా దినోత్సవం

● రాజాంకు చెందిన ఓ యువకుడు ఇటీవల దుస్తుల దుకాణం ప్రారంభించాడు. తన షాపులో ఉన్న కొత్త మోడళ్లకు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టాడు. అతి తక్కువ సమయంలోనే అత్యధికంగా లైక్స్ రావడమే కాకుండా వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతోంది. సోషల్ మీడియా సహకారంతో ఆయన అత్యధిక ఆదాయం పొందుతున్నాడు.

రాజాం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి)

మనిషి జీవితంపై సోషల్ మీడియా పెను ప్రభావం చూపుతోంది. ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రపోయే వరకూ సోషల్ మీడియాను ఎక్కువ మంది వినియోగిస్తున్నారు. సాధారణంగా ఉదయం లేచిన వెంటనే దేవుడి చిత్రపటాలకు దండం పెడుతుంటారు. కానీ ఇప్పుడు చాలామంది లేవగానే సెల్‌ఫోన్ కోసం తడుముతున్నారు. లేచిన వెంటనే సోషల్ మీడియాను వీక్షిస్తున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం వంటిని చూస్తున్నారు. సమాచార వ్యాప్తిలో సోషల్ మీడియాది కీలక పాత్ర. ఒక వ్యక్తి జీవితంలో కలిగే బాధ, ఆనందం, విజయం, అపజయం.. ఇలా అన్నిరకాల భావోద్వేగాలను అందరితో పంచుకోవడానికి ఇదో సాధనం. అయితే సోషల్ మీడియా వినియోగంలో చాలా జాగ్రత్తలు అవసరమని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల లాభాలతో పాటు నష్టాలు ఉంటాయంటున్నారు. సోషల్ మీడియా ద్వారా ఎంతోమంది పేరుప్రఖ్యాతలు సంపాదించారు. అదే సోషల్ మీడియా కొందరి జీవితాలను తలకిందులు చేసింది. అందుకే సోషల్ మీడియాలో మీరు ఏం చేస్తారు? ఎలాంటి సమాచారం కోసం వెతుకుతారు? అనేది విశ్లేషించుకోవాలి. మనకు ఉపయోగం అనుకున్న వాటినే ఎంచుకోవాలి. సోమవారం ప్రపంచ సోషల్ మీడియా దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

జాగ్రత్తలు పాటించకపోతే నష్టం తప్పదు..

సోషల్ మీడియాను జాగ్రత్తగా వాడుకోకపోతే నష్టం తప్పదు. చాలామంది వ్యక్తిగత జీవితాలపై అనేక (మిగతా 8వ పేజీలో..)

ఆయన గానం.. జనరంజకం

- సినీ నేపథ్య గాయకుడిగా జానపద కళాకారుడు అసిరయ్య
- వెనుక సోషల్ మీడియా సహకారం

రాజాం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆయనో జానపద కళాకారుడు. పల్లె పదాలను అద్భుతంగా కూర్చి తన గొంతుతో (మిగతా 8వ పేజీలో..)



రైలులో పాట పాడుతున్న అసిరయ్య(ఫైల్)

జానపదాల జానకిరావు..



ఉత్తరాంధ్రలో జానపదాలకు ఒక ఊపు తెచ్చింది రేలారేలా కళాకారుడు కోరాడ జానకిరావు అని చెప్పుకుంటారు. చిన్నప్పటి నుంచే జానపదాలపై ఆసక్తి పెంచుకున్న జానకిరావు పాఠశాల స్థాయిలోనే సత్తాచాటాడు. చదువు కొనసాగిస్తూనే గజ్జె కట్టి పల్లె పదాన్ని అలవోకగా పాడాడు. సోషల్ మీడియా ద్వారా విశేష ఆదరణ పొందాడు. ప్రస్తుతం సినీ రచయితగా, జానపదాల కళాకారుడిగా రాణిస్తున్నారు. మెంటాడ మండలం వేమలికి చెందిన జానకిరావుది సామాన్య కుటుంబం. తల్లిదండ్రులు అప్పన్న, పైడితల్లి. ఇద్దరూ వ్యవసాయ కూలీలే. వ్యవసాయ పనుల సమయంలో తల్లితో పాటు పెద్దమ్మ పాడే పాటలను జానకిరావు గ్రహించాడు. అది మొదలు పల్లె పదాలు వినిపిస్తే చాలు పాటగా మలచి పాడేవాడు. అదే ఆయనలో ఉన్న ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పింది. డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా 2008లో మాటీవీ నిర్వహించిన రేలారేరేలాలో పాడి బహుమతులు సొంతం చేసుకున్నాడు. అప్పటి నుంచి ఉత్తరాంధ్ర జానపదాలంటే జానకిరావు పేరు మార్మోగిపోతోంది. తన ప్రతిభను వెలుగులోకి తెచ్చింది సోషల్ మీడియా అని ఆయనే చెబుతుంటారు.

పల్సర్ బైక్ పాటతో రమణ ప్రకంపనలు..



పల్సర్ బైక్ రమణ సొంతూరు మెరకముడిదాం మండలంలోని కొర్లాం. ఎనిమిదో తరగతి చదువుతుండగా రమణ తండ్రి అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబ ఆర్థిక కారణాల రీత్యా రమణ చదువుకు దూరమయ్యాడు. ఓ కంపెనీలో పనిచేస్తూ జానపదాలంటే ఆసక్తి పెంచుకున్నాడు. నిత్యం యూట్యూబ్‌లో జానపదాలు వినేవాడు. ఈ రంగంలో గాయకుడిగా రాణించాలనుకునేవాడు. ఈ క్రమంలోనే కోరాడ జానకిరావు వద్దకు వెళ్లాడు. అప్పటికే రేలారేరేలాతో పాపులర్ అయ్యారు జానకిరావు. ఆయన శిష్యరికంలో స్టేజీ ప్రోగ్రాంలో రమణకు అవకాశం దక్కింది. అయితే పల్సర్ బైక్ పాటతో సోషల్ మీడియాలో రమణ ఎనలేని క్రేజ్ దక్కించుకున్నాడు. ధమాకా సినిమాలో పల్సర్ బైక్ పాటతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఫేమస్ అయ్యాడు. ఎన్నో జానపదాలు పాడినా రాని క్రేజ్ ఆ ఒక్క సినిమాతో వచ్చింది. కానీ అందులో రమణ పాడలేదు. కానీ అంతకంటే ముందే రమణ పాడిన పాటను ఆ సినిమాలో వాడుకోవడంతో పాపులర్ అయ్యాడు. అటు తరువాత చాలా స్టేజీ ప్రోగ్రాంతో పాటు బుల్లితెరపై తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నాడు. తనను ఇంత స్థాయిలో పెట్టింది ప్రజలు, పెరిగిన సోషల్ మీడియా అని సగర్వంగా చెబుతుంటాడు రమణ.

అభివృద్ధి లేని ఐటీఐలు

- సిబ్బంది కొరత
- పాత భవనాల్లోనే బోధన
- ఏటా వేలాది మంది విద్యార్థులకు శిక్షణ
- ఆ స్థాయిలో కనిపించని ఉపాధి అవకాశాలు
- కాంట్రాక్టు సిబ్బందే ఆధారం
- మార్పుపై ఆశలు





రాజాం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సాంకేతిక శిక్షణ ఇచ్చి, ఉపాధి చూపాలన్న ఉద్దేశంతో పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐ) ఏర్పాటు కాగా నేడు అవి ఆశించిన స్థాయిలో పురోగతి సాధించలేకపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏటా ఆరు వేల మంది వరకూ ఐటీఐలో చేరుతున్నారు. అదే స్థాయిలో చదువు పూర్తి చేస్తున్నారు. ఎలక్ట్రానిక్, వెల్డర్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, సివిల్ డ్రాఫ్ట్‌మెన్ వంటి కోర్సులు ఉన్నాయి. కానీ ఎన్ని క్యాంపస్ డ్రైవ్‌లు జరుగుతున్నాయి? ఎంతమందికి ఉపాధి దొరికింది? ఎందరు ఉద్యోగాలు పొందుతున్నారు? అంటే మాత్రం సమాధానం లేదు.

ఉమ్మడి జిల్లా పరిధిలో ఆరు ప్రభుత్వ ఐటీఐ కాలేజీలు ఉన్నాయి. విజయనగరం, రాజాం, బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు, కురుపాం ఐటీఐలను సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ముఖ్యంగా పాత భవనాల్లోనే విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. తగినంతమంది సిబ్బంది కూడా లేరు. కొద్దిరోజులుగా శాశ్వత నియామకాలు లేవు. కాంట్రాక్ట్ సిబ్బందే ఆధారంగా ఉన్నారు. విజయనగరం ప్రభుత్వ ఐటీఐలో 14 యూనిట్లకుగాను శిక్షణ ఇచ్చే సిబ్బంది ఇద్దరు మాత్రమే. వీరిలో ఒకరే రెగ్యులర్. మరొకరు కాంట్రాక్ట్ ఉద్యోగి. ఈ ఐటీఐలో వందలాది మంది విద్యార్థులు ఉన్నారు. ట్రేడ్‌కు తగ్గట్టు శిక్షణనిచ్చేవారు మాత్రం లేరు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ (మిగతా 8వ పేజీలో..)

బలోపేతానికి చర్యలు

జిల్లాలో ఐటీఐ బలోపేతానికి అన్నిచర్యలు చేపడుతున్నాం. వసతితో పాటు సిబ్బంది కొరత విషయంపై ప్రభుత్వానికి నివేదించాం. ఉన్నంతలో మంచిగానే శిక్షణ అందిస్తున్నాం. జిల్లాకు ఉద్యోగ మేళాలను రప్పించేలా చూస్తున్నాం.

- టీవీ గిరి, జిల్లా ప్రభుత్వ ఐటీఐల కన్వీనర్, విజయనగరం

అమ్మో.. ఇ-సెక్షన్

- రెండు నెలల వ్యవధిలో ముగ్గురు సూపరింటెండెంట్ల మార్పు

విజయనగరం కలెక్టరేట్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ఇ-సెక్షన్ చాలా కీలకం. మిగిలిన వాటి కంటే భిన్నం. భూములకు సంబంధించిన ఫైళ్లపై అక్కడే తుది నిర్ణయం తీసుకుంటారు. మండల, డివిజన్ స్థాయి నుంచి నివేదికలు తెప్పించుకుని ఆధారాలతో ఫైళ్లు తయారు చేస్తారు. ఆపై డీఆర్వో నుంచి జేసీ, కలెక్టర్ ద్వారా సీసీఎల్ఏకు వెళ్తాయి. ఈ ప్రక్రియలో సూపరింటెండెంట్ కీలకం. తీవ్ర పనిభారం ఉంటుంది. ఈ కారణంతోనే ఇ-సెక్షన్ సూపరింటెండెంట్ బాధ్యతలు తీసుకోవడానికి కొందరు ఉద్యోగులు భయపడుతున్నారు. గత రెండు నెలల వ్యవధిలో ముగ్గురు సూపరింటెండెంట్‌లు మారారు.

రెండు నెలల కిందటి వరకూ ఉన్న ఇ-సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్‌ను మార్చి సీ-సెక్షన్‌కు పంపారు. సీ-సెక్షన్ సూపరింటెండెంట్‌గా ఉన్న శ్రీనివాసమిశ్రాకు ఇ-సెక్షన్ బాధ్యతలు అప్పగించారు. ఈనెల 5వ తేదీన జారీ అయిన తహసీల్దార్ల బదిలీ జాబితాల్లో మిశ్రాను విజయనగరం ఆర్డీవో కార్యాలయం పరిపాలన అధికారిగా నియమించారు. పూసపాటిరేగ తహసీల్దార్ తాడి గోవిందను సీ-సెక్షన్‌కు నియమించారు. కాగా బదిలీల్లో డెంకాడ తహసీల్దార్‌గా పని చేసిన పద్మావతిని వంగర మండలానికి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఆమె అంత దూరం వెళ్లడానికి ఇబ్బంది అని ఉన్నతాధికారులకు మొరపెట్టుకోవడంతో తిరిగి కలెక్టరేట్‌లో ఇసెక్షన్ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ కొద్ది రోజులు క్రితం ఉత్తర్వులు ఇచ్చారు. కానీ ఆమె ఇ-సెక్షన్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకోవడానికి ఇష్టపడలేదు. దీంతో సీ-సెక్షన్ సూపరింటెండెంట్ గోవిందకు ఇ-సెక్షన్ అప్పగించి పద్మావతికి సీ-సెక్షన్ అప్పగించారు. గతంలో ఇదే సెక్షన్‌లో గోవింద (మిగతా 8వ పేజీలో..)





తాగునీటికి కటకట

- నెల్లిమర్లలో ప్రజల అవసరాలను తీర్చని రక్షిత పథకం
- పట్టణ ప్రజలకు తప్పని ఇబ్బందులు
- చంపావతి నదిలోని ఊటబావి ఎండిపోయిన వైనం

7లో

జిందాల్ నిర్వాసితుడిపై దాడి

- పోరాటం ఆపకపోతే భార్యా బిడ్డలను చంపేస్తామని బెదిరింపులు
- ఎమ్మెల్సీ రఘురాజు అంతుచూస్తామని హెచ్చరిక
- ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

7లో

స్నేహితుడిని దింపేందుకు వెళ్లి..

- రోడ్డు ప్రమాదంలో ఇంటర్మీడియట్ విద్యార్థి దుర్మరణం

7లో

సమ్మెతో తాగునీటి ఇక్కట్లు

8లో

- ఇంజనీరింగ్ కార్మికులు విధుల బహిష్కరణ
- సమస్యలు పరిష్కరించాలని నిరసన

పింఛన్ల పంపిణీ తర్వాతే..

- సచివాలయాల సిబ్బందికి రిలీవ్
- నేటితో బదిలీల ప్రక్రియ పూర్తి
- ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ఉన్నతాధికారులు



గరుగుబిల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిస్తున్న సిబ్బందికి బదిలీల ప్రక్రియ కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే జూలై నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీ ప్రక్రియ పూర్తయిన తర్వాతే వారిని రిలీవ్ చేయాలని రాష్ట్ర జీఎస్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ ఎం.శివప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. జూలై 5 తర్వాత సిబ్బందికి కేటాయించిన స్థానాల్లో హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం సచివాలయాల సిబ్బంది బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. మొదటిగా సర్వేయర్లకు స్థానచలనం కల్పించారు. ఆపై ఏఎన్ఎంలు, అగ్రికల్చర్, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్ల బదిలీ ప్రక్రియ సాగుతోంది. సోమవారం మహిళా పోలీస్ సిబ్బందికి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. మొత్తంగా ఈ నెల 30తో బదిలీల ప్రక్రియ పూర్తికానుంది. సొంత మండలాలకు చెందిన వారికి వేరే ప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చారు. రాజకీయ సిఫారసులకు తావులేకుండా ఉమ్మడి జిల్లాల అధికారులు నిబంధనల మేరకు బదిలీలు నిర్వహిస్తున్నారు.

ఆదేశాలు అందాయి

సచివాలయాల సిబ్బందిని పింఛన్ల పంపిణీ తర్వాతే రిలీవ్ చేయాలని ఆదేశాలు అందాయి. జూలై 1 నుంచి 5వ తేదీ వరకు పింఛన్లు పంపిణీ ప్రక్రియ జరగనుంది. పింఛన్‌దారులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. దీనిపై సచివాలయాల సిబ్బందికి సమాచారం అందించాం.

- ఎన్.అర్జునరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో, గరుగుబిల్లి

జోరు వాన

- వేపాడలో అధికం .. గరివిడి, నెల్లిమర్లలో అత్యల్పం

విజయనగరం కలెక్టరేట్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఆదివారం ఉదయం ప్రారంభమైన వాన రాత్రి వరకూ వీడలేదు. దీంతో ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. జూన్ నెలలో కనీస స్థాయిలో కురవకపోవడంతో నిరాశలో ఉన్న అన్నదాతకు ఈ వర్షం కాస్త ఊరటనిచ్చింది. వరి నారువేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 12.4 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. వేపాడలో అత్యధికంగా 33.6 మిల్లీమీటర్లు పడగా, అత్యల్పంగా గరివిడి, నెల్లిమర్లల్లో 2.2 మిల్లీమీటర్లు కురిసింది. మిగిలిన చోట్ల మోస్తరు వర్షాలు పడ్డాయి. రహదారులన్నీ చిత్తడి చిత్తడిగా మారాయి.



చీపురుపల్లిలో కురుస్తున్న వర్షం

కూర్మ.. నరసింహావతారాల్లో జగన్నాథుడు



విజయనగరం రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా రోజుకో అవతారంలో దర్శనమిచ్చే జగన్నాథ బలభద్రులు ఆదివారం కూర్మ, నరసింహా అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నగరంలోని కాళ్ల నాయుడు మందిరం రోడ్డులో వున్న జగన్నాథ స్వామి ఆలయం, అదే విధంగా కర్రల మార్కెట్ వద్ద వున్న జగన్నాథస్వామి ఆలయాల్లో స్వామి వార్లను కూర్మ, నరసింహా అవతారాల్లో ముస్తాబు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించి పూజలు నిర్వహించారు. నగరంలోని పురాతన ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు జరిగాయి.

సంగాం వైపు గజరాజులు



రేగిడి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రేగిడి మండలం సరసనాపల్లిలోకి అర్ధరాత్రి చొరబడి కలకలం రేపిన గజరాజులు వేరొక ప్రాంతానికి తరలాయి. శనివారం రాత్రి వంగర మండలం సరిహద్దున నాగావళి తీరంలో ఉన్న సంగాం చేరుకొన్నాయి. సరసనాపల్లి పరిసరాల్లో జొన్నతోటలు, వరి ఆకుమళ్లు, మామిడి తోటల్లో రెండురోజులు హల్‌చల్‌చేసిన విషయం విదితమే. రెండేళ్ల క్రితం కూడా పంటపొలాలు, ఒకరిద్దరి ఆస్తులను నష్టపరిచాయి.

తాగునీటికి కటకట

● నెల్లిమర్లలో ప్రజల అవసరాలను తీర్చని రక్షిత పథకం ● పట్టణ ప్రజలకు తప్పని ఇబ్బందులు

నెల్లిమర్ల, జూన్29 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీలో తాగునీటి ఇబ్బందులు షరా మామూలయ్యాయి. దశాబ్దాలుగా ఇదే పరిస్థితి. నెల్లిమర్ల చంపావతి నదీ పరివాహక ప్రాంతమే అయినప్పటికీ వారికి తాగునీటి సమస్యలు తప్పడంలేదు. నగర పంచాయతీ పరిధిలోని 21 వార్డుల పరిధిలో 15 ఏళ్ల కిందట తాగునీటి పైప్‌లైన్ వేశారు. అప్పటి జనాభా 27 వేల మందికి తగ్గట్టుగా ఏర్పాటు చేశారు. కానీ ఇప్పుడు పట్టణంలో దాదాపు 40 వేల మంది జనాభా ఉన్నారు. పెరిగిన జనాభాకు తగ్గట్టు నీటి సరఫరా చేసే పరిస్థితి ఇప్పుడు లేదు.



నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో మహిళల నిరసన (ఫైల్)

ఆరు వార్డుల్లో నీటి ఇబ్బందులు..

పట్టణ జనాభాకు రోజుకు సగటున 2.46 మిలియన్ లీటర్ల నీరు అవసరం. ప్రస్తుతం అందులో సగం నీరు మాత్రమే సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా 5,6,7,8, 9,10 వార్డుల్లో నీటి ఇబ్బందులు అధికంగా ఉన్నాయి. శివారు వార్డులకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. పలు ప్రాంతాల్లో భూమట్టానికి మూడు నుంచి ఐదు అడుగుల గోతిలోని కుళాయి నుంచి తాగునీటి పట్టుకునే పరిస్థితి ఉంది. చాలాచోట్ల పైప్‌లైన్ లీక్ అవుతోంది. నీరు కలుషితమవుతోంది. కొన్నిచోట్ల తాగు నీరు వృథాగా పోతోంది. దీనికితోడు పట్టణంలో పదుల సంఖ్యలో బోర్లు పనిచేయడం లేదని అధికారులే చెబుతున్నారు.

మూలకు చేరిన వనరులు..

నెల్లిమర్ల నగర పంచాయతీ తాగునీటి కోసం చంపావతిలో ఊటబావులు ఏర్పాటుచేశారు. వాటి ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. క్లోరినేషన్ చేపట్టిన తర్వాత రక్షిత మంచినీటి పథకాల ద్వారా నీటిని ప్రతిరోజూ సరఫరా చేస్తున్నారు. అయితే ఈ నీరు ప్రజల అవసరాలకు ఏ మూలకు సరిపోవడం లేదు. తాగునీటి పైలెట్ ప్రాజెక్టు నిర్మాణం ఇక్కడ కార్యరూపం దాల్చలేదు. దీంతో ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం.

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం..

నెల్లిమర్ల నగర పంచాయతీలో తాగునీటి ఎద్దడి నిజమే. అయితే ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిని అందిస్తున్నాం. ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. త్వరలో సమగ్ర మంచినీటి పథకంతో పాటు కేంద్ర నిధులతో చేపడుతున్న ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది. **-తారకనాథ్, కమిషనర్, నెల్లిమర్ల నగర పంచాయతీ**



చంపావతి నదిలో ఊటబావి

మహిళ అదృశ్యం

సంతకవిటి, జూన్29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలరాంపేటకు చెందిన ఎన్ని సుగుణ (30) అదృశ్యమైనట్టు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. బలరాం పేటకు చెందిన సుగుణకు 2014లో పోలాకి మండలం డోల గ్రామానికి చెందిన ఎన్ని అప్పలనాయుడుతో వివాహం జరిగింది. వివాహం జరిగిన ఏడాది తర్వాత నుంచి వారి మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. దాంతో బలరాంపేటలో తల్లిదండ్రులు, అన్నయ్యతో ఆమె కలిసి ఉంటుంది. గత గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆదివారం ఆమె సోదరుడు సురవరపు అప్పలరాము ఫిర్యాదు చేశారని ఎస్ఐ తెలిపారు.

ఒకరికి గాయాలు

సంతకవిటి, జూన్29 (ఆంధ్రజ్యోతి): మండలంలోకి పొనుగుటివలస సమీపం వరలక్ష్మీనగర్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో తెర్లాం మండలం నెమలాం గ్రామానికి చెందిన ఎద్దుబోయిన రామలక్ష్మి గాయాల పాలైందని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు భార్యాభర్తలు ఎద్దుబోయిన రామలక్ష్మి, గోవింద్ ద్విచక్ర వాహనంపై మండలంలోని అక్కరాపల్లిలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి కారు ఢీకొందన్నారు. దాంతో వరలక్ష్మికి గాయాలయ్యాయన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు

విజయనగరం దాసన్నపేట, జూన్29 (ఆంధ్రజ్యోతి): వివిధ గ్రామాలకు చెందిన నిరుపేద ఇంజనీరింగ్, మెడికల్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు అమ్మ సేవా సొసైటీ ఉపకార వేతనాలను అందజేసింది. ఆదివారం నగరంలోని బాలాజీనగర్‌లోని అమ్మ సేవా సొసైటీ కార్యాలయంలో విద్యార్థులకు రూ.1.50 లక్షల ఉపకార వేతనా లను సొసైటీ అధ్యక్షురాలు ర్యూన్సీ లక్ష్మీబాయి అందజేశారు. అలాగే, 20 మంది విభిన్న ప్రతిభావంతుల కుటుంబాలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు సాంబశివరావు, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

15లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

రాజాం రూరల్, జూన్29 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరీక్షలకు జులై 15 లోగా ఫీజు చెల్లించాలని హిందీ ప్రచారక్ కొండవలస మధుసూదనరావు తెలిపారు. పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ వరకు సెప్టెంబరులో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వివరాలను 9949917365ను సంప్రదించాలని కోరారు.

వ్యాధులపై అప్రమత్తం

జామి, జూన్29 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మేజర్ పంచాయతీ జామిలో వ్యాధులు ప్రబలకుండా మండల అధికారులు చర్యలు చేపట్టారు. 16 వార్డుల్లో తాగు నీటి వనరుల్లో క్లోరినేషన్, పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేశామని ఈవోపీఆర్‌డీ ఉమ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడారు. పంచాయతీ పరిధిలోని 12 మంది గ్రీన్ అంబాసిడర్లతో ఎప్పటికప్పుడు పనులు చేయిస్తున్నామన్నారు. ఆమెతో పాటు పంచాయతీ ఈవో ప్రసాద్ ఉన్నారు.

పాఠశాలకు సామగ్రి వితరణ

వేపాడ, జూన్29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోంపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు రూ.20 వేల విలువైన సామగ్రి వితరణ చేశారని హెచ్‌ఎం బీపీఏ రాజు తెలిపారు. స్కూల్ అసిస్టెంట్లు బంటు శ్రీనువాసరావు, బి.జ్యోతి, గూనూరు హరికృష్ణ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శ్రీగురు పట్నాలు, బి.సత్యారావు, ఎం.గంగా భవాని, బి.ఉన్నీషా, కె.నవీన్.. పాఠశాలకు 10 కుర్చీలు, 3 లాంగ్ టేబుల్స్ సమకూర్చినట్టు హెచ్‌ఎం వివరించారు. అలాగే ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, రవిశంకర్, ఎం.గౌరి, టి.విజయభవానీ రూ.10 వేల విలువైన పుస్తకాలు, పెన్నులు అందజేశారని హెచ్‌ఎం తెలిపారు.

టీడీపీ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే

విజయనగరం రూరల్, జూన్29 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఆదివారం టీడీపీ రాష్ట్ర కమిటీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పాల్గొన్నారు. పార్టీ సంస్థాగత ఎన్నికలు, జులై 2 నుంచి ఇంటింటి ప్రచారం, పార్టీ భవిష్యత్ కార్యాచరణ తదితర వాటిపై నిర్వహించిన సమీక్షల్లో ఆమె పాల్గొన్నారు.



మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి

జనసేనలో పలువురి చేరిక

భోగాపురం, జూన్29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కాం పంచాయతీకి చెందిన 40 కుటుంబాలు ఆదివారం భోగాపురం జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి సమక్షంలో జనసేనలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే పార్టీ జనసేన అన్నారు. గ్రామాల అభివృద్ధి, మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతోందన్నారు. జనసేనలో చేరిన వారిలో వాసుపల్లి దాసు, అనంత్, మైలపల్లి ధనరాజ్ తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే నాగమాధవి

నేడు ఏఎంసీ చైర్మన్ ప్రమాణస్వీకారం

గజపతినగరం, జూన్29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయంలో సోమవారం ఉదయం ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయనున్నట్టు పీవీవీ గోపాలరాజు తెలిపారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచన మేరకు పార్టీ అధిష్ఠానం తనకు ఏఎంసీ చైర్మన్ పదవి ఇచ్చిందన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టన్ను ప్రమాణస్వీకారానికి కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యేలు బేబినాయన, కోళ్ల లలితకుమారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తదితరులు హాజరుకానున్నారన్నారు. ఆయనతో పాటు మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ వైస్ చైర్మన్ కోరాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవీవీ గోపాలరాజు

పరిశ్రమలతో వేలాది మందికి ఉద్యోగాలు

శృంగవరపుకోట రూరల్, జూన్29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవర ప్రాంతంలోని జిందాల్ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటైతే వేలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం జిందాల్ కార్యాలయం ఎదుట పరిశ్రమలు ఏర్పాటు చేయాలని నిర్వహిస్తున్న శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కలెక్టర్ అంబేద్కర్ సహకారంతో అందరి సమస్యలు పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ కృషి చేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వంలో ఏ ఒక్కరికి అన్యాయం జరగదని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు

పల్లిగండ్రేడులో 'మన్‌కీ బాత్'

గుర్ల, జూన్29 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ మన్‌కీ బాత్ 123వ ఎపిసోడ్‌ను ఆదివారం మండలంలోని పల్లిగండ్రేడులో ప్రజలు చూసేందుకు బీజేపీ నాయకులు ఏర్పాట్లు చేశారు. బూత్ నెంబరు 217లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేశ్వర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అనంతరం మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి తెలియపరిచిన అంశాలపై రాజేశ్వర్మ, రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటగిరి నారాయణరావు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ పాక రాణి నాగమల్లిక, మండల అధ్యక్షుడు పోలిపల్లి కనకరాజు, ఆకుల మహేష్, కె.వెంకటప్పలనాయుడు, మజ్జ రామారావు, కొండపల్లి శ్రీనివాస్, పతివాడ రాజేశ్, చింతాడ రాజేశ్, ఎస్.ప్రదీప్‌కుమార్, సీహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మన్‌కీ బాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

సందడిగా అ'పూర్వ' కలయిక

చీపురుపల్లి, జూన్29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1999-2000 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని సందడి చేశారు. అలనాటి ఉపాధ్యాయులు ఆర్.విజయకుమార్, జి.సత్యనారాయణ, సన్యాసిరాజులను సత్కరించారు. కార్యక్రమంలో గవిడి సురేష్, తిలక్, భాస్కరరావు, రెడ్డి ఆనంద్, కింతలి నరేష్, సూరిబాబు, ధనుంజయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



విజయకుమార్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

జిందాల్ నిర్వాసితుడిపై అర్ధరాత్రి దాడి

●పోరాటం ఆపకపోతే భార్యా బిడ్డలను చంపేస్తామని బెదిరింపులు

●ఎమ్మెల్సీ రఘురాజు అంతుచూస్తామని వెల్లడి

●ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

శృంగవరపుకోట రూరల్, జూన్29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లి పంచాయతీకి చెందిన జిందాల్ నిర్వాసితుడు ముత్యాల సన్యాసిరావుపై శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ప్రస్తుతం బాధితుడు ఎస్‌కోట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. జిందాల్‌పై పోరాటం చేస్తున్న తాము న్యాయవాదిని కలిసేందుకు శనివారం విశాఖ వెళ్లామన్నారు. తిరిగి బొడ్డవర చేరుకునే సరికి రాత్రి 12 గంటలు కావడంతో తన ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరానన్నారు. నవోదయ విద్యాలయం, బందవలస గ్రామాల మధ్యలో తన బైక్‌ను మంకీ క్యాప్స్ ధరించిన ముగ్గురు వ్యక్తులు ఆపారన్నారు. తాళాలు లాక్కొని పక్కకు తీసుకెళ్లి ముఖంపై బలంగా కొట్టారన్నారు. ఆ తర్వాత తన డొక్కలో బలంగా గుద్ది కిందపడేశారన్నారు. ఆ సమయంలో వారు నువ్వు జిందాల్‌పై చేస్తున్న పోరాటం వెంటనే మానేయ్. లేదంటే నీభార్య, బిడ్డలు దక్కరు. నీకు అండగా ఉన్నానని అంటున్న ఎమ్మెల్సీ అంతుచూస్తామని దుర్భాషలాడారన్నారు. తనను విడిచిపెట్టాలని వేడుకోవడంతో వదిలేశారన్నారు. అనంతరం ఇంటికి చేరుకుని గ్రామస్థులకు విషయం చెప్పానన్నారు. వారితో తనపై దాడి చేసిన స్థలానికి వెళ్లామన్నారు. అక్కడ ఎవరూ కనిపించలేదన్నారు. దాంతో 100 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చామన్నారు. ఆ తర్వాత తనను కుటుంబసభ్యులు ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారని వివరించారు. సన్యాసిరావుపై దాడి విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, జిందాల్ నిర్వాసితులు ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు నిర్వాసితులు మాట్లాడుతూ తమ పోరాటానికి తోడుగా ఉన్న ఎమ్మెల్సీకి హాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనుడిపై జరిగిన దాడిపై జిల్లా మంత్రి శ్రీనివాస్, హోం మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ దర్యాప్తు చేయాలని కోరారు. దాడి ఘటనపై ఎస్ఐ గంగరాజు కేసు నమోదు చేశారు.



సన్యాసిరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ

దాడులతో పోరాటం ఆపే ప్రయత్నం: ఎమ్మెల్సీ

శృంగవరపుకోట రూరల్, జూన్29 (ఆంధ్రజ్యోతి): జిందాల్ నిర్వాసితులు తమ న్యాయపరమైన సమస్యలు తీర్చాలని శాంతియుతంగా చేస్తున్న పోరాటాన్ని ఆపే ప్రయత్నం దాడుల రూపంలో ప్రారంభమైందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పరిశ్రమ ఏర్పాటు సమయంలో జిందాల్ పరిశ్రమను స్వాగతిస్తున్నానని అప్పట్లో తనను మావోయిస్టులు హెచ్చరించారని గుర్తుచేశారు. తనతో పాటు ఈ ప్రాంత ప్రజాప్రతినిధులకు అప్పట్లో వారు అదే మాట చెప్పారన్నారు. ఇప్పుడు ఈ పోరాటం ఆపేందుకు ఏకంగా దాడులకు తెగబడటం దారుణమన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటును ఎవరూ వ్యతిరేకించలేదని, జిందాల్ నుంచి రావాల్సిన పరిహారాలు మాత్రమే అడుగుతున్నారని స్పష్టం చేశారు. ఈ మాత్రం దానికి దాడులు చేయడం, చంపేస్తామని హెచ్చరికలు చేయడం వంటివి చూస్తుంటే ఇక్కడకు ఫ్యాక్షన్ సంస్కృతి వచ్చిందా అని పిస్తుందన్నారు. వెంటనే కలెక్టర్, ఎస్పీ నిర్వాసితులకు రక్షణ కల్పించాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతన అలవరచుకోండి

డెంకాడ, జూన్29 (ఆంధ్రజ్యోతి): హిందువులకు ఆధ్యాతిక చింతన అవసరమని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షుడు, ఆనంద ఆశ్రమ వ్యవస్థాపకుడు శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. ఆదివారం మండలంలోని గుణుపూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో సత్సంగాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసానంద సరస్వతి మాట్లాడుతూ ఆధ్యాత్మికత.. జీవిత చరమాంకంలో తెలుసుకోవాల్సిన అంశం కాదన్నారు. చిన్ననాటి నుంచి దైవభక్తి అలవరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలకు దైవభక్తి, దేశభక్తి, సన్మార్గంలో నడిచే విధానాన్ని నేర్పించాలన్నారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా హిందూధర్మ రక్షాసమితి సభ్యులు వేణుగోపాలస్వామి, వశిష్ట విద్యానికేతన్ కరస్పాండెంట్ చందక రమేశ్‌బాబు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



సత్సంగంలో శ్రీనివాసానంద సరస్వతి

ఉద్యోగాలకు 527 మంది ఎంపిక

రాజాం, జూన్29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ఆదివారం స్థానిక భాష్యం స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ చొరవతో ఏర్పాటైన మేళాకు 1155 మంది హాజరు కాగా అందులో 527 మందిని వివిధ ఉద్యోగాలకు 29 బహుళజాతి కంపెనీల ప్రతినిధులు ఎంపిక చేశారు. నెలకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు వారికి వేతనాలు చెల్లించనున్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంత్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు కొండ్రు జగదీశ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాశరావు, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, శాసపు రమేశ్‌కుమార్, లక్షుభుక్త కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



జాబ్ మేళాకు హాజరైన యువత

ఎస్ఎస్ఆర్‌పేటకు సీసీ రోడ్డు

గుర్ల, జూన్29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలకొండ-విజయనగరం రోడ్డుకు ఆనుకుని ఎస్ఎస్ఆర్‌పేట రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రెండు రోజుల కిందట సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు. ఇటీవల 'బురదరోడ్డుకు మోక్షం లేదా' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్డు వేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చెరువులో పడి యువకుడి మృతి

తెర్లాం, జూన్29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినజనార్దనవలసలో ఆదివారం బహిర్భుమికి వెళ్లిన గుళిపల్లి సత్యనారాయణ(31) మృతి చెందాడు. ఎస్ఐ సాగర్‌బాబు కథనం మేరకు.. సత్యనారాయణ ఆదివారం ఉదయం బహిర్భుమికి వెళ్లాడు. నీళ్ల కోసం గ్రామ సమీపంలోని చెరువుకు వెళ్లిన అతడు అక్కడ మూర్ఛ వ్యాధి వల్ల చెరువులో పడి మృతి చెందాడు. సత్యనారాయణ డిగ్రీ పూర్తి చేశారు. బొబ్బిలిలో గ్రోత్ సెంటర్‌లో మెకానిక్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. సత్యనారాయణకు తల్లిదండ్రులతో పాటు సోదరుడు ఉన్నారు. తల్లిదండ్రుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. మృతుడికి వివాహం కాలేదు.



సత్యనారాయణ (ఫైల్)

స్నేహితుడిని దింపేందుకు వెళ్లి..

●రోడ్డు ప్రమాదంలో ఇంటర్మీడియట్ విద్యార్థి దుర్మరణం

బొబ్బిలి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని పాత బొబ్బిలి పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటర్మీడియట్ విద్యార్థి అలమండల ఉదయరాజ్ (17) దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. విశాఖలోని ఓ కళాశాలలో ఉదయ్‌రాజ్ ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరాడు. హోంసిక్ సెలవులు ఇవ్వడంతో ఇంటికి వచ్చాడు. సెలవులు పూర్తవడంతో సోమవారం కళాశాలకు తిరిగి వెళ్లిపోయేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ నేపథ్యంలో బొబ్బిలి రాతి పనివారి వీధికి చెందిన ఉదయ్‌రాజ్ తన స్నేహితుడిని పాత బొబ్బిలిలో బైక్‌పై దింపేసి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో బైక్‌ను లారీ ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో బైక్‌పై వెళ్తున్న ఉదయ్‌రాజ్ రోడ్డుపై పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఉదయరాజ్ తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తండ్రి రవి బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. తల్లి ఉష గృహిణి, ఓ తమ్ముడు ఉన్నాడు. సమాచారం తెలియగానే ఎస్ఐ జ్ఞానప్రసాద్, ఏఎస్ఐ ఆదిత్యలు సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పాత బొబ్బిలిలో రోడ్డు అధ్వానంగా ఉండడం వల్లే ఉదయరాజ్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం బోల్తాపడిందని స్థానికులు తెలిపారు.



ఉదయరాజ్ (ఫైల్)

లింక్ తెరవగానే సొమ్ము మాయం

పాలకొండ, జూన్29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగన్నవలస గ్రామానికి చెందిన యువకుడు డి.ఉపేంద్ర బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.56,900 నగదును దోచేశారు. గతంలో వలంటీర్‌గా పనిచేసిన ఉపేంద్ర సచివాలయ ఉద్యోగుల గ్రూప్‌లో సభ్యుడిగా ఉన్నాడు. ఓ ఉద్యోగి నుంచి వాట్సాప్‌లో ఆర్‌టీకే లింక్ వచ్చింది. ఆ లింక్‌ను తెరవగానే ఉపేంద్ర అకౌంట్‌లో ఉన్న రూ.50 వేలు సైబర్ క్రైం కేటుగాళ్లు లాగేశారు. దీన్ని గమనించిన ఉపేంద్ర స్టేట్‌బ్యాంకు ఉద్యోగులను సంప్రదించేందుకు పాల కొండ వస్తున్న క్రమంలో మరో రూ.6,900 నగదును సైబర్ నేరగాళ్లు మళ్లీ తీసేశారు. ఇది గమనించిన ఉపేంద్ర తన అకౌంట్‌లో ఉన్న వేరే అకౌంట్‌కు నగదు జమ చేశాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

సెప్టెంబరులో జనవిజ్ఞాన వేదిక మహాసభలు

విజయనగరం దాసన్నపేట, జూన్29 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో సెప్టెంబరు 13, 14 తేదీల్లో నిర్వహించనున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని వేదిక రాష్ట్ర కార్యదర్శి కె.త్రిమూర్తులు పిలుపునిచ్చారు. ఆదివారం ఎన్‌జీవో హోంలో నిర్వహించిన ఆహ్వాన సంఘ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు హేతుబద్ధంగా ఆలోచించాలని, జీవించాలని 30 ఏళ్లుగా జన విజ్ఞాన వేదిక అవిరామంగా కృషి చేస్తోందన్నారు. పర్యావరణ విద్య, ఆరోగ్యం, సామాజిక న్యాయం తదితర అంశాలపై ఉద్యమాలు నిర్వహించి తెలుగు ప్రజలతో విడదీయలేని బంధాన్ని ఏర్పరచుకుందన్నారు. జిల్లా అధ్యక్షుడు వెంకటరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మూఢ నమ్మకాలు చెలరేగి ప్రజల ధన, మాన, ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితిల్లో జన విజ్ఞాన వేదిక ముందుండి పరిష్కారం కోసం ఎనలేని కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో రమణ ప్రభాత్, దివాకర్, విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న వేదిక ప్రతినిధులు

9న దేశవ్యాప్త సమ్మె

విజయనగరం దాసన్నపేట, జూన్29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గంపై అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని నిరసిస్తూ జూలై 9న దేశవ్యాప్త సమ్మెను చేపట్టనున్నామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ తెలిపారు. కార్మికవర్గం సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆదివారం నగరంలోని కె.ఎల్.పురం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా 18 మందితో పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎ.జగన్మోహనరావు, బి.రమణ, కోశాధికారిగా రవికుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రెడ్డి శంకరరావు, సురేష్, సీఐటీయూ ప్రతినిధులుపాల్గొన్నారు.

పశువుల వ్యాన్ సీజ్

దత్తిరాజేరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పశువుల వ్యాన్‌ను ఆదివారం సీజ్ చేసినట్టు స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేశ్ తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా 9 పశువులతో పార్వతీపురం నుంచి సామర్లకోట తరలిస్తున్న పశువుల వ్యాన్‌ను వాహన తనిఖీల్లో భాగంగా గుర్తించామన్నారు. వ్యాన్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

జగన్నాథుడికి పూలంగి సేవ రేపు

విజయనగరం రింగురోడ్డు, జూన్29 (ఆంధ్రజ్యోతి): జగన్నాథ రథయాత్రలో భాగంగా జూలై 1న మంగళవారం జగన్నాథ, బలభద్ర, సుభద్రలకు లక్ష చామంతి పూలతో పూలంగిసేవ నిర్వహించనున్నట్టు మందిరం పర్యవేక్షకుడు బొడ్డు వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. ఆదివారం హుకుంపేట గుడించా మందిరం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రథయాత్రలో భాగంగా ఐదోరోజున పూలంగి సేవఅనంతరం భగవద్గీత 18వ అధ్యాయం పారాయణం, విష్ణు సహస్రానామార్చన, సుందరకాండ పారాయణం జరుగుతుందన్నారు.

మురుగు నీటి చెంతనే పైపులైన్లు

- పర్యవేక్షణ లేకపోవడంతో పొంచి ఉన్న ప్రమాదం
- ఇదీ బొబ్బిలి మండలంలో పలు గ్రామాల్లో పరిస్థితి



పెంటలో మురుగు కాలువలో తాగునీటి పైపులు

బొబ్బిలి రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట, దిబ్బగుడ్డివలస తదితర గ్రామాల్లో తాగునీటి పైపులైన్లు మురుగుకాలువల చెంతనే ఉండడంతో ప్రమాదం పొంచిఉంది. ప్రధానంగా పైపులైన్ల నిర్వహణపై పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేకుండాపోయింది. వాస్తవానికి పైపులైన్ల ఏర్పాటుచేసిన సమయంలోనే కాలువల గుండా వెళ్లకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. పైపులైన్ల చెంత నుంచే మురుగు ప్రవహించడం వల్ల తాగునీరు కలుషితమయ్యే ప్రమాదముందన్న ఆందోళన నెలకొంది. దీనికితోడు దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన పైపులు కావడంతో అక్కడక్కడ లీకవుతుండడంతో వీటి గుండా మురుగునీరు చేరు అవకాశముందని పలువురు వాపోతున్నారు. పలు గ్రామాల్లో రోడ్లు ఏర్పాటు చేసినా కాలువలు లేకపోవడంతో వర్షం కురిస్తే ఇళ్లలోని వాడుకనీరు రోడ్డుపైకి చేరుతోంది. కొన్నిచోట్ల రోడ్డుకు అనుకుని ఉన్న పైపుల వద్ద రోజుల తరబడి మురుగునీరు నిల్వ ఉంటోంది. పలు గ్రామాల్లో ఉదయం ఒకేసారి మురుగునీరు బయటకు విడిచిపెట్టడంతో పైపులు ఆ నీటిలో మునుగుతున్నాయి. పలుసార్లు పంచాయతీ అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదన్న విమర్శలొస్తున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో కలుషితనీరు తాగడం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశముందన్న ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో తక్షణమే పంచాయతీ అధికారులు మురుగునీటిలో ఉన్న పైపులైన్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



దిబ్బగుడ్డివలసలో మురుగు కాలువ చెంతనే ఉన్న తాగునీటి పైపులు

భాషా బోధకులను నియమించాలి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు డిమాండ్



మాట్లాడుతున్న జేసీ రాజు

బొబ్బిలి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రాథమికోన్నత పాఠశాలల్లో భాషా బోధకులను నియమించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనరు జేసీ రాజు డిమాండ్ చేశారు. ఆదివారం బొబ్బిలిఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ తెలుగు, హిందీ బోధించే ఉపాధ్యాయులు లేకపోవడంతో యూపీ స్కూళ్లలో అడ్మిషన్లు మందకొడిగా సాగుతున్నాయన్నారు.విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపకపోవడంతో యూపీ స్కూళ్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు.మిగులు ఉపాధ్యాయులను నియమించి యూపీస్కూళ్లను పరిరక్షించాలని కోరారు.మేలో నిర్వహించాల్సిన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ని ఇప్పుడు నిర్వహించడంలో అర్థం లేకుండాపోయిందన్నారు.ప్రైవేట్ స్కూళ్లు, వసతి గృహాల్లో విద్యార్థులు చేరిపోయిన తర్వాత ఎందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారన్నారు.క్లస్టర్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను రోజుకో పాఠశాలకు పంపించడంతో వారు ఇబ్బందిపడుతున్నారన్నారు. కేడర్ స్ట్రెంగ్త్‌ను ఫైనలైజ్ చేసి ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సుదీర్ఘకాలంగా ఉపాధ్యాయులు,ఉద్యోగులకు ప్రభుత్వం బకాయిపడిన డీఏలు, పీఆర్సీ బకాయిలను చెల్లించాలని,పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించా లని డిమాండ్‌చేశారు.మెగాపేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని ఆగస్టుకు వాయిదా వేయాలని జేసీ రాజు డిమాండ్‌చేశారు. సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు ప్రవీణ్‌కుమార్, ఆర్ఎన్ రాజు, చిన్నారావు, బీడీ దర్శనం పాల్గొన్నారు.

నేడు మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

బొబ్బిలి రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మహిళా సర్పంచ్‌లకు బొబ్బిలిలో వెలుగు కార్యాలయంలో సోమవారం శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీవో పి.రవికుమార్ ఒకప్రకటనలో తెలిపారు.రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌కార్యాచరణ 2025-26 ప్రణాళికపై బొబ్బిలి, తెర్లాం, బాడంగి, రామభద్రపురంమండలాల్లో గల మహిళా సర్పంచ్‌లకు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు శిక్షణ జరుగుతుందని పేర్కొన్నారు.

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రామినాయుడు

బొబ్బిలి/రూరల్,జూన్ 29(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలని బొబ్బిలి మాజీ సైనికసంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు రామినాయుడు కోరారు. ఆదివారం బొబ్బిలి పాతకోటలోని సంఘం కార్యాలయంలో రామినాయుడు ఆధ్వర్యంలో అధ్యక్షుడు రేవళ్లకిరణ్‌కుమార్ పర్యవేక్షణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామినాయుడు మాట్లాడుతూ మాజీ సైనికులకు ఇళ్లస్థలాలులేవని, ఉపాధి అవకాశాలు ప్రభుత్వం నుంచి అందడం లేదని తెలిపారు. జిల్లా సైనికాధికారి ద్వారా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోడానికి ప్రణాళిక సిద్ధం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రెడ్డి రామకృష్ణ, కార్యవాహక కార్యదర్శి ఎస్ఆర్ మోహనరావు, ట్రెజరర్ శర్మపాల్గొన్నారు.

శిష్టకరణ సంఘం కార్యవర్గం ఎన్నిక

బొబ్బిలి/రూరల్,జూన్ 29(ఆంధ్రజ్యోతి):బొబ్బిలి ప్రాంత శిష్టకరణ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం సంఘం కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా శిష్టకరణ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా పెదపెంకి శివప్రసాద్, అధ్యక్షుడిగా వంతరం శ్రీరామమూర్తి, ప్రధాన కార్యదర్శిగా నిడగంటిప్రసాదరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.శ్రీనివాస్ పట్నాయక్, ఉపాధ్యక్షులుగా పట్నాయకుని వేణుగోపాలరావు, కుప్పిలి నాగరాజేశ్వరరావు, అదనపు కార్యదర్శిగా పట్నాయకుని రత్నాకర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.

అమ్మో.. ఇ-సెక్షన్

(ఐదో పేజీ తరువాయి)

సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ఇక్కడ పనిభారం అధికంగా ఉంటుంది. జిల్లాలో ఫ్రీహోల్డ్ చేసిన భూములపై సీసీఎల్ఏ ఎప్పటికప్పుడు నివేదికలను తీసుకుంటుంది. అలాగే 22 ఏ భూముల ఫైళ్లు కూడా ఇ-సెక్షన్ నుంచి ఉన్నతాధికారులకు వెళ్తాయి. మరెన్నో కార్యకలపాలు ఇ-సెక్షన్ ద్వారా సాగుతాయి. ఈ తరుణంలో ఇక్కడ సూపరింటెండెంట్ బాధ్యతలు తీసుకోవడానికి అధికారులు భయపడుతున్నట్లు తెలుస్తోంది.

నిర్వహణ లేక.. పూడికలు తొలగించక

- శివారు ఆయకట్టుకు అందని నీరు
- ఆందోళన చెందుతున్న వీఆర్ఎస్ రైతులు

బొబ్బిలి రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలంలోని గోపాలరాయుడుపేట, సీతయ్యపేట, దిబ్బగుడ్డివలస గ్రామాల పరిధిలోని వీఆర్ఎస్ ఆయకట్టుకు నీరందడం లేదు. ప్రధానంగా కాలువలు నిర్వహణ లేకపోవడంతోపాటు పూడికలు తొలగించకపోవడంతో ఖరీఫ్‌లో సైతం శివారు ఆయకట్టుకు నీరుచేరడంలేదు.వీఆర్ఎస్ కాలువ అడుగడుగునా పూడికలతో నిండిపోయింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా తుప్పలు, పిచ్చిమొక్కలు తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. ఈనేపథ్యంలో బొబ్బిలి మండలంలో ఐదు వందల ఎకరాలకు, సీతానగరం మండలంలోని ఐదు గ్రామాల పరిధిలో 500 ఎకరాలకు నీరందని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది వేసవిలో ఉపాధి హామీ పథకం నిధులతో కాలువలను లైనింగ్‌చేస్తారని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. కాగాఉపాధిహామీ నిధులతో పనులు చేయిస్తామన్ని నీటిపారుదల ఏఈ సుధీర్ తెలిపారు.



దిబ్బగుడ్డివలస వద్ద వీఆర్ఎస్ కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు

ఆక్రమణలు తొలగించరు.. విస్తరణ పనులు ప్రారంభించరు

- జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్య
- ఇదీ గజపతినగరంలో పరిస్థితి



మెంటాడ రోడ్డులో నిలిచిపోయిన ట్రాఫిక్

గజపతినగరం,జూన్29 (ఆంధ్రజ్యోతి): గజపతినగరంలో ఇళ్ల యజమానుల ఒత్తిడి వల్ల డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించని పరిస్థితి నెలకొంది.ఈనేపథ్యంలో రోడ్డువిస్తరణపనులు ప్రారంభంకావడం లేదు. దీంతో జనాభాతోపాటు వ్యాపార లావాదే వీలు పెరుగుతుండడంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది.

గజపతినగరం జాతీయరహదారి నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి మెంటాడ రైల్వేగేటు వరకు ఆర్అండ్‌బీ రోడ్డులో ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. వైసీపీ హయాంలో రోడ్డు విస్తరణలో భాగంగా పనులు చేపట్టారు. ఈ పనుల్లో భాగంగా సర్వేచేపట్టి సగానికి పైగా స్థలంసేకరించాల్సిఉంది. అయితే రోడ్డు పక్కన ఉన్న యజమానులు తమ ఇళ్లకు ఆనుకుని ఉన్న డ్రైనేజీలను ఆక్రమించారు. ప్రస్తుతం కొందరు ప్రజాప్రతినిధులతో అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో ఆక్రమణల తొలగింపు ముందుకుసాగడంలేదు. దీంతో రోడ్డు ఇరుగ్గా మారడంతోపాటు ద్విచక్రవాహనాలు, ఆటోలు, స్కూల్ బస్‌లు, నిత్యం రాకపోకల రద్దీతో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.దీనికితోడు రోడ్డుపైనే రైతులు ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి కూరగాయలను విక్రయిస్తుండడంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు.ఈనేపథ్యంలో ఇటీవల 1.2 కిలోమీటర్ల మేర సుమారు 39 లక్షల రూపాయలతో రోడ్డు మరమతులు చేపట్టారు. అయితే ఆక్రమణల వైపు వెళ్లకుండా పనులు నిర్వహించడంతో నాణ్యత లోపించిందని, కొన్నిచోట్ల చిన్నపాటివర్షానికి రోడ్డుపై నీరుచేరుతోందని స్థానికులు చెబుతున్నారు.దీంతో రోడ్డుపై ట్రాఫిక్‌సమస్య, వర్షానికి నీరు చేరడంపై స్థానికులు మంత్రి కొండపల్లిశ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లడంతో చేసి సర్వేచేయాలని అధికారులకు ఆదేశించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికా రులు రోడ్డు విస్తరణ 40 అడుగులు ఉండేలా సర్వే చేపట్టారు. అయితే రెండునెలలు కావస్తున్నా రోడ్డువిస్తరణ పనులు ప్రారంభం కాలేదు. ఇక్కడ రోడ్డు విస్తరణ పనులు జరిగితే కొందరికి నష్టం జరు గుతుందని, అందువల్ల పనులు చేపట్టడంలేదని, మంత్రి ఆదేశాలిచ్చినా అధి కారులు అలసత్వం చూపడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గజపతినగరంలో రోడ్లు విస్తరించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని పలువురు వాహన చోదకులు కోరుతున్నారు.

ఆక్రమణదారులకు నోటీసులిస్తాం

గజపతినగరంలోని నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి మెంటాడ రైల్వే గేటువరకు ఆర్అండ్‌బీ, పంచాయతీ, రెవెన్యూఅధికారులు సర్వే చేపట్టారని పురిటిపెంట ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఆక్రమణ దారులకు నోటీసులిచ్చి స్వచ్ఛందంగా తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. లేకపోతే తామే తొలగిస్తామని తెలిపారు.

సమ్మెతో తాగు నీటికి ఇక్కట్లు

- ఇంజనీరింగ్ కార్మికుల విధుల బహిష్కరణ
- జిల్లాలోని నగరపాలకసంస్థ, మునిసిపాలిటీల్లో సమస్యలు పరిష్కరించాలని నిరసన



రాజాంలో ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

రాజాం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):జిల్లాలోని విజయనగరం నగర పాలకసంస్థ, బొబ్బిలి, రాజాం మునిసిపాలిటీలు, నెల్లిమర్ల నగర పంచాయతీలో ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె వల్ల తాగునీటికి కష్టాలు తప్పడంలేదు. తాగునీటి సరఫరాకు తీవ్రఅంతరాయం కలుగుతోంది. తమ సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, శ్రమకు తగినవేతనం ఇవ్వాలని విధులు బహిష్కరిస్తున్నారు. వైసీపీ హయాంలో వేతనాలపెంపుపై కాలయాపన చేశారని కార్మికులు వాపోతున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వేతనాలు పెంచాలని తాజాగా సమ్మెకు దిగారు.

●రాజాం మునిసిపాలిటీలోని 24 వార్డుల్లో పూర్తిగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. ఇక్కడ 13 మంది కాంట్రాక్ట్ కార్మికులు రూ.13 వేల నుంచి రూ.15 వేల వరకూ వేతనంతో పనిచేస్తున్నారు. 50 వేల మంది జనాభా ఉన్న పట్టణంలో రోజుకు ఏడు లక్షలకుపైగా లీటర్ల నీరు అవసరం. సమ్మె వల్ల ఇందులో సగం మాత్రమే సరఫరా జరుగుతోంది.

●విజయనగరం నగరపాలక సంస్థలో 3.2 లక్షల మంది జనాభాఉన్నారు.రోజుకు సగటున 40 లక్షల లీటర్ల నీరు అవసరం. ప్రస్తుతం కాంట్రాక్ట్ సిబ్బంది విధులు బహిష్కరించడంతో 26 లక్షల లీటర్ల నీటిని రోజు విడిచిరోజు అందించగలుగుతున్నారు.

● బొబ్బిలి మునిసిపాలిటీ 63 వేల జనాభాకు పది లక్షల లీటర్ల తాగునీరు అవసరం కాగా ప్రస్తుతం రోజుకు మూడున్నర లక్షల లీటర్లు మాత్రమే అందుతోంది. శివారుప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.

●నెల్లిమర్ల నగరపంచాయతీలో 27వేలమందిజనాభాకు రోజుకు 2.50 లక్షల లీటర్ల తాగునీరు అవసరం కాగా లక్షా 33 వేల లీటర్లు మాత్రమే అందుతోంది. చంపావతి నది ఆనుకుని ఉన్నా కార్మికుల సమ్మెతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది.



రాజాంలో నిరసన తెలుపుతున్న ఇంజనీరింగ్ కార్మికులు

ఇవీ కార్మికుల డిమాండ్లు..

●టెక్నికల్ కార్మికులకు రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,500 జీతం చెల్లించాలి. ● మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి. ● హెచ్ఆర్ పాలసీ పరిధిలోకి తీసుకురావడంతోపాటు మినిమం టైంస్కేల్ వర్తింపజేయాలి. ●అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారికి ఆరు శాతం ఇంక్రిమెంట్‌తో జీతం పెంచాలి. పదవీవిరమణ బెనిఫిట్స్ కింద రూ.10 లక్షలు చెల్లించాలి. ● కారుణ్య నియామకాలతో పాటు గ్రాట్యూటీ సదుపాయం కల్పించాలి.

మంచికి వాడుకుందాం

(ఐదో పేజీ తరువాయి)

పోస్టులు పెడుతుంటారు. సమాచారాన్ని షేర్ చేస్తుంటారు.ఇటీవల సోషల్ మీడియాలో రాజకీయ, విధానాపరమైన పోస్టులే ఎక్కువగా దర్శనమిస్తుం టాయి. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్ణయాలు, న్యాయపరమైన విధానాలపై వచ్చే పోస్టులను ఇతరులకు పంపడం ద్వారా చిక్కుల్లో పడుతుంటాం. అనవసరంగా పోలీసు కేసుల బారిన పడుతుంటాం. అటువంటి సమయంలో సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు సాక్ష్యాలుగా చూపుతున్నారు పోలీసులు. లేనిపోని లింకులు క్లిక్ చేయడం, పరిచయం లేని వ్యక్తుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్టులకు దూరంగా ఉండడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం సోషల్‌మీడియాలో ఎక్కువ మంది ఎదుర్కొంటున్న సవాళ్లు అసభ్యపదజాలాలు. కామెంట్ల రూపంలో కొందరు అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటారు. కొన్నిసార్లు మనం పెట్టే పోస్టులు, షేర్లు, కామెంట్లతో న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొనే అవకాశంఉంటుంది. ఒక వేళ నచ్చని పోస్టు, సమాచారం ఉంటే వాటిని చూడకపోవడం, అనుసరించకపోవడమే ఉత్తమం.'ముఖ్యంగా పిల్లలు సోషల్ మీడియాకు ఎడిక్ట్ కాకుండా చూసుకోవాలి. సోషల్‌మీడియాను అడ్డం పెట్టుకొని అనేక రకాలుగా సమాజంలో విచ్ఛిన్నకర శక్తులు ప్రవేశిస్తున్నాయి. ఇది గుర్తెరిగి ప్రతిఒక్కరూ బాధ్యతతో ఉండాల్సిన అవసరం ఉంది.' అని శ్రీకాకుళానికి చెందిన వైద్య నిపుణుడు కళ్యాణబాబు చెబుతున్నారు.

ఆయన గానం.. జనరంజకం

(ఐదో పేజీ తరువాయి)

మనోరంజకంగా పాడేవారు. దశాబ్దకాలం ప్యాసింజర్ రైలులో ప్రయాణికులను ఉర్రూతలూగించారు. రైళ్లలో యాచన చేస్తుండగా సాగిన ఆయన పాటల ప్రస్థానం సోషల్ మీడియా ద్వారా బయట ప్రపంచానికి తెలిసింది. అంతే దశ తిరిగింది. సినీ నేపథ్య గాయకుడిని చేసింది. సంతకవిటి మండలం వాల్తేరు గ్రామానికి చెందిన బోనెల అసిరయ్య ప్రస్థానమిది.

ఉత్తరాంధ్రలో జముకు వాయిద్యానికి విశేష ఆదరణ ఉండేది. జముకుతో జానపదాలు పాడుతూ జనాన్ని అప్పట్లో కళాకారులు రంజింపజేసేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వివిధ మాధ్యమాల ప్రభావంతో ఆ కళకు ఆదరణ తగ్గింది. కానీ అదే కళను నమ్ముకున్నారు సంతకవిటి మండలం వాల్తేరు గ్రామానికి చెందిన బోనెల అసిరయ్య. ఎటువంటి చదువు లేకపోయినా వాడుక భాషలో ఉండే పదాలను జతకూర్చుతూ జముకు కళను నేర్చుకున్నారు. పగలంతావ్యవసాయ కూలీపనులు చేసుకుంటూ రాత్రిపూట జముకు పరికరంతో జానపదాలతో పల్లె ప్రజలకు వినోదం పంచేవారు. ఈ కళకు ఆదరణ తగ్గడంతో ప్రతిరోజూ పొందూరు నుంచి పలాస వెళ్లే ప్యాసింజర్ రైళ్లు.. విశాఖ వైపు వెళ్లే రైళ్లలో జముకుతో జానపదాలు పాడుతూ జీవించేవారు. అసిరయ్య పాటలకు వీడియోలు తీసిన కొందరు అభిమానులు సోషల్ మీడియాలో షేర్ చేశారు.అలా ఆ వీడియోలు పేరు మోసిన రికార్డింగుసంస్థల దృష్టికి వెళ్లాయి. ఈక్రమంలో ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్, నేపథ్య గాయకుడు రఘు కుంచే చెవిలో పడ్డాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన దర్శకుడు కద్దాల కిరణ్‌కుమార్ దర్శకత్వంలో వచ్చిన 'పలాస 1978' సినిమాలో పాడే అవకాశం కల్పించారు. అసిరయ్య పాడుకునే నాదీ నక్లీస్ గొలుసు మంచి ప్రేక్షకాదరణ పొందింది. సోషల్ మీడియా విశేష ఆదరణ పొందింది. ఒక సాధారణ కళాకారుడిగా ఉన్న అసిరయ్యను సోషల్ మీడియా గుర్తింపు కలిగిన వ్యక్తిగా మార్చేసింది.

అభివృద్ధి లేని ఐటీఐలు

(ఐదో పేజీ తరువాయి)

ట్రైనింగ్ సంస్థ గుర్తింపు దక్కినా శిక్షకుల పోస్టులు మాత్రం మంజూరు చేయడం లేదు. బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో నలుగురు రెగ్యులర్, ముగ్గురు కాంట్రాక్ట్ శిక్షకులు విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ 24 యూనిట్లలో వందలాది మంది విద్యార్థులు ఉన్నారు. సిబ్బంది కొరత ఒక వైపు, ఇరుకు గదుల్లో విద్యార్థులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. అందుకే ఎక్కువ మంది విద్యార్థులు ప్రైవేటు ఐటీఐల వైపు మొగ్గుచూపుతున్నారు. సిబ్బందిపరంగా రాజాం, సాలూరులో ఫర్వాలేదు. ఎందుకంటే ఇక్కడ ఐటీఐల ఏర్పాటుతోనే శిక్షకులను నియమించారు.

ఐటీఐ అంటే విపరీతమైన డిమాండ్ ఉంది. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వ ఐటీఐలను తీర్చిదిద్దలేకపోతున్నారు. పదో తరగతి తరువాత ఎక్కువ మంది ఐటీఐ విద్యవైపు చూస్తున్నారు. దీనికి కారణం లేకపోలేదు. రైల్వేతో పాటు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వపరంగా విద్యుత్, పంచాయతీరాజ్ వంటి శాఖల్లో ఐటీఐ అర్హతతో ఉద్యోగాలు లభిస్తున్నాయి. 2019లో సచివాలయాల విద్యుత్ లైన్‌మెన్లు, సర్వేయర్ పోస్టులు వేలాదిగా భర్తీ అయ్యాయి. ఆ సమయంలో ఐటీఐ ఎలక్ట్రానిక్, సివిల్ డ్రాఫ్ట్‌మెన్ కోర్సులు చేసిన వారికి పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించాయి. ఆ తర్వాత ఐటీఐకి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అయితే కొన్ని ప్రైవేటు ఐటీఐల తీరుపై విమర్శలు ఉన్నాయి. జిల్లా వారిని కాకుండా ఛత్తీస్‌గఢ్, ఒడిశా విద్యార్థులకు పెద్దపీట వేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.